తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 21 - డిసెంబర్ 2025 | సంపుటి:3 | సంచిక:203 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in



## నిజాంల నాటి చెరువుకు ప్రాణం పోసిన హైడ్రా

- బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు ప్రారంభానికి సన్నాహం
- అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):

పాతబస్తీలో నిజాంల నాటి చారిత్రక చెరువుకు హైడ్రా ప్రాణం పోసింది. కబ్జాలను తొలగించి ఊపిరిలూదింది. ఆక్రమణలతో ఆనవాళ్లే కోల్పోయిన చెరువును బతికించింది. చరిత్రను తవ్వితీసిన మాదిరి చెరువును రూపొందించి చారిత్రక వైభవాన్ని హైడ్రా చాటింది.

మిగతా 2లో..





## అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ సమర్పించిన సిఎం రేవంత్ రెడ్డి

హజ్రత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తి 814వ ఉర్సును పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్‌ను సమర్పించారు. అజ్మీర్ షరీఫ్ దర్గా ఆధ్యాత్మికత, సామాజిక సామరస్యం, ప్రేమ, సోదరభావాలకు ప్రతీకగా నిలుస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన చాదర్ సమర్పణ కార్యక్రమంలో మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎంపీ పోరిక బలరాం నాయక్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు కార్యక్రమంలో హాజరయ్యారు. అలాగే టిఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ ఖాద్రీ పాషా బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో పాటు ఇతర ముస్లిం మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

- హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

# కడియం మార్క్ ఏది?


### నీతి- నిజాయితీ రాజకీయానికి ముగింపా?

### కూతురు రాజకీయ భవిష్యత్తు కోసం తన ఇమేజ్‌ను తానే తాకట్టు పెట్టుకున్నారా?

'బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం' 2లో

ఫ్లెక్సీతో రాజుకున్న రాజకీయం

స్టేషన్ ఘనపూర్‌లో రాజకీయ దుమారం




హన్మకొండ, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు స్పష్టమైన వైఖరి, నేరుగా మాట్లాడే ధోరణి, నీతి-నిజాయితీకి ప్రతీకగా నిలిచిన పేరు కడియం శ్రీహరి. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, మాటకు కట్టుబడే రాజకీయవేత్తగా ఆయన సంపాదించుకున్న గుర్తింపు చిన్నది కాదు. అలాంటి నాయకుడు నేడు తనే సృష్టించుకున్న రాజకీయ సంక్షోభంలో చిక్కుకుని, రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన విమర్శలు ఎదుర్కొంటుండటం గంభీర చర్చకు దారి తీసింది.

"కడియం మార్క్ అంటే ఏమిటి?" అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనే కాదు, సామాన్య ప్రజల్లోనూ గట్టిగా వినిపిస్తోంది.

బిఆర్ఎస్ టికెట్‌పై స్టేషన్ ఘన్‌పూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు బహిరంగ సభల్లో పలుమార్లు ప్రకటించారు. కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. అయితే బిఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు చట్టం కింద అనర్హత పిటిషన్ దాఖలు చేయడంతో వ్యవహారం కోర్టు, స్పీకర్ వరకు చేరింది. ఈ నేపథ్యంలో స్పీకర్ ముందు మాత్రం "నేను ఇంకా బిఆర్ఎస్‌లోనే ఉన్నాను" అంటూ రాతపూర్వక అఫిడవిట్ సమర్పించడం రాజకీయంగా తీవ్ర విరుద్ధతను బయటపెట్టింది. ప్రజల ముందు ఒక మాట, అధికారికంగా మరో మాట——ఇది రాజకీయ వ్యూహమా? లేక అవసరానికి అనుగుణంగా మారే ద్వంద్వ వైఖరియా? అన్న సందేహాలు బలంగా వ్యక్తమవుతున్నాయి.

మిగతా 2లో..



## ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

- జాబ్ క్యాలెండర్ ఉండాల్సిందే
- లేకుంటే యువత భవిష్యత్ దెబ్బతింటుంది
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):

పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శక నియామకాల ద్వారానే ప్రజాసేవలో ప్రతిభకు స్థానం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

మిగతా 2లో..

# ఉపాధి హామీని కాపాడుకుందాం

### రాష్ట్ర మంత్రి సీతక్క పిలుపు



హైదరాబాద్,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దానసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా పోరాడాలని ఆమె పేర్కొన్నారు. ఈ చట్టం పేదలు, గ్రామీణ కార్మికులకు భరోసా కల్పించే కీలక రక్షణ కవచమని, ఇరవై ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే దిశగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మంత్రి సీతక్క విమర్శించారు.

మిగతా 2లో..

### జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే

# ప్రభుత్వ ధ్యేయం

### పది రోజుల్లో అక్రిడిటేషన్ కార్డుల జీవో

వచ్చే ఏడాది ఇళ్ల స్థలాల కేటాయింపు పై తీపి కబురు

టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటన

హైదరాబాద్,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):

జర్నలిస్టుల చిరకాల వాంఛలైన అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో మంత్రి ఫోన్ ద్వారా జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు.




మిగతా 2లో..



## నేనైతే రేవంత్‌తో ఫుట్‌బాల్ ఆడుకుంటా

- రేవంత్ ఎవరితో ఫుట్‌బాల్ ఆడినా అక్కర్లేదు
- రేవంత్ లాగా చిల్లర రాజకీయాలు చేయను
- కాంగ్రెస్‌లో ఓ కాలు..బిజెపిలో ఓ కాలు పెట్టింది రేవంతే
- మీడియా చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):

రేవంత్.. ఎవరితో ఫుట్ బాల్ ఆడుకుంటాడో నాకు తెలియదు... నేను మాత్రం రేవంత్ రెడ్డిని ఫుట్ బాల్ ఆడుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కడియం మార్క్ ఏది?

(మొదటి పేజీ తరువాయి)

ఈ ద్వంద్వ వైఖరే స్టేషన్ ఘన్‌పూర్‌లో ఇటీవల చోటుచేసుకున్న 'బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం' ఫ్లెక్సీ వివాదానికి అసలు నేపథ్యంగా మారింది. ఫ్లెక్సీ అనేది ఒక బోర్డు మాత్రమే కాదు——అది రాజకీయ నైతికత పై లేవనెత్తిన ప్రశ్నలకు ప్రతీకగా మారింది. పార్టీ మారడం రాజకీయాల్లో కొత్త కాదు. కానీ పార్టీ మారిన తర్వాత కూడా, అవసరమైతే పాత గుర్తింపునే అధికారికంగా కొనసాగించడం ఎంతవరకు సమర్థనీయం? ప్రజాస్వామ్యంలో స్పష్టత కంటే కీలకమైనది మరొకటి ఉండదన్న వాదన ఇక్కడ బలంగా వినిపిస్తోంది.

డిసెంబర్ 20న స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాల్టీలో తిరుమలనాథ స్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి కడియం శ్రీహరి హాజరవుతారన్న సమాచారంతో బిఆర్ఎస్ శ్రేణులు రంగంలోకి దిగారు. "బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఘన స్వాగతం" అంటూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఫొటోలతో కూడిన ఈ ఫ్లెక్సీలు రాజకీయ సార్కాసానికి రూపంగా మారాయి. కడియం స్పీకర్‌కు ఇచ్చిన వివరణకు అనుగుణంగానే ఫ్లెక్సీలు పెట్టామని బిఆర్ఎస్ నేతలు వాదించారు.

అనుమతి లేదన్న కారణంతో మున్సిపల్ సిబ్బంది, పోలీసులు ఫ్లెక్సీలు తొలగించేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బిఆర్ఎస్ శ్రేణులు ప్రతిఘటించడంతో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన నేతలు తీవ్రంగా మండిపడుతూ, "పార్టీ మారినా ఇంకా అదే పార్టీలో ఉన్నానంటూ చెప్పుకోవడం సిగ్గుచేటు. ఎమ్మెల్యే పదవిని కాపాడుకోవడానికి ఇంత దిగజారడం దారుణం" అంటూ విమర్శలు గుప్పించారు.

ఈ వివాదానికి అసలు మూలం ఫిరాయింపు కేసే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన కడియం శ్రీహరి, కూతురు కడియం కావ్య వరంగల్ ఎంపీగా కాంగ్రెస్ టికెట్‌పై గెలవడంలో కీలక పాత్ర పోషించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కూతురు రాజకీయ భవిష్యత్తును సురక్షితంగా నిలబెట్టాలన్న ఆలోచనలో తాను సంపాదించుకున్న ఇమేజ్‌ను తానే దెబ్బతీశారా? అన్న ప్రశ్న తప్పించుకోలేనిదిగా మారింది. ఒక తండ్రిగా ఆలోచించడంలో తప్పులేదు. కానీ ప్రజాజీవితంలో ఉన్న నాయకుడు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజల్లో ఏర్పడిన నమ్మకాన్ని తాకట్టు పెట్టడం రాజకీయంగా సమర్థనీయం కాదన్నది స్పష్టమైన సత్యం.

నీతి, నిజాయితీకి మారు పేరుగా చెప్పుకునే నాయకత్వం ఒకసారి స్పష్టత కోల్పోతే ప్రజల విశ్వాసం చీలిపోతుంది. రాజకీయాల్లో చట్టపరమైన తప్పించుకోవడం సాధ్యమయ్యే అవకాశముండవచ్చు. కానీ నైతికంగా ఓడిపోయిన రోజు నుంచే నాయకుడి పతనం మొదలవుతుందన్నది చరిత్ర చెబుతున్న పాఠం. ఈ రోజు కడియం శ్రీహరి ఎదుర్కొంటున్న పరిస్థితి అదే హెచ్చరికను గుర్తు చేస్తోంది.

ఇది ఒక వ్యక్తి కథ మాత్రమే కాదు. ఇది తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపులు, వ్యక్తిగత ఆశయాలు, ప్రజా నైతికత మధ్య జరుగుతున్న పోరాటానికి ప్రతిబింబం. స్పీకర్ తుది నిర్ణయం ఏదైనా కావచ్చు. కోర్టు తీర్పు ఇంకోలా ఉండొచ్చు. కానీ ప్రజల కోర్టులో మాత్రం తీర్పు ఇప్పటికే మొదలైంది. నీతి రాజకీయాల నుంచి ద్వంద్వ వైఖరి వరకు సాగిన ఈ ప్రయాణంలో—— "కడియం మార్క్" నిలబడుతుందా? లేక ఒకప్పుడు ఉన్న రాజకీయ విలువలు కరిగిపోయిన ఉదాహరణగా మిగిలిపోతుందా? అన్నది కాలమే తేల్చాలి.





# 'బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం' ఫ్లెక్సీతో రాజుకున్న రాజకీయం

## స్టేషన్ ఘనపూర్‌లో రాజకీయ దుమారం

**స్టేషన్ ఘనపూర్, డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ కేంద్రంగా చోటుచేసుకున్న ఒక ఫ్లెక్సీ వ్యవహారం తెలంగాణ రాజకీయాలను ఒక్కసారిగా కుదిపేసింది. 'బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం' అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, కేవలం అనుమతి లేని బ్యానర్ వివాదంగా కాకుండా, పార్టీ ఫిరాయింపులు, కోర్టు ఆదేశాలు, స్పీకర్‌కు ఇచ్చిన వివరణల చుట్టూ తిరిగే తీవ్రమైన రాజకీయ సంక్షోభానికి ప్రతీకగా మారింది.

కడియం శ్రీహరి బిఆర్ఎస్ పార్టీ తరపున స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యేగా ఎన్నికై, అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం బహిరంగమే. ఆయనతో పాటు రాష్ట్రంలో మొత్తం 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడం తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారాన్ని లేపింది. ఈ పరిణామాలను సవాలు చేస్తూ భారత రాష్ట్ర సమితి కోర్టును ఆశ్రయించింది. బిఆర్ఎస్ నుంచి గెలిచి ఇతర పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపుల చట్టం ప్రకారం అనర్హత వేటు వేయాలని కోర్టును కోరింది.

ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన కోర్టు, వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది. దాంతో స్పీకర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి వివరణ కోరారు. ఇక్కడే రాజకీయంగా అత్యంత కీలక మలుపు ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పలుమార్లు బహిరంగంగా ప్రకటించిన కడియం శ్రీహరి, స్పీకర్‌కు మాత్రం తాను బిఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నట్లు రాతపూర్వక వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఇదే అంశం ఇప్పుడు తీవ్ర వివాదానికి దారి తీసింది.

ఈ నేపథ్యంతోనే స్టేషన్ ఘనపూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో, తిరుమల నాథ స్వామి ఆలయ ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కడియం శ్రీహరి హాజరవుతున్న సందర్భంగా బిఆర్ఎస్ శ్రేణులు 'బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం' అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశాయి. ఇది ఉద్దేశపూర్వక రాజకీయ సంకేతమని కాంగ్రెస్ వర్గాలు ఆరోపించగా, కడియం స్పీకర్‌కు ఇచ్చిన వివరణకు అనుగుణంగానే ఫ్లెక్సీ పెట్టామని బిఆర్ఎస్ నాయకులు వాదిస్తున్నారు.

అయితే మున్సిపల్ అనుమతి లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారన్న కారణంతో మున్సిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పోలీసులు ఫ్లెక్సీని తొలగించి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బిఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకుల అరెస్ట్‌లు చోటుచేసుకున్నాయి. దీంతో స్టేషన్ ఘనపూర్‌లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఒక ఫ్లెక్సీ చుట్టూ మొదలైన వివాదం, ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల చట్టం, స్పీకర్ నిర్ణయం, ఎమ్మెల్యేల భవితవ్యంపై చర్చకు దారి తీసింది. కడియం శ్రీహరి ఇచ్చిన వివరణపై బిఆర్ఎస్ నాయకుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొనగా, కాంగ్రెస్ వర్గాలు దీన్ని రాజకీయ కక్షగా అభివర్ణిస్తున్నాయి. స్పీకర్ తీసుకునే తుది నిర్ణయం ఏమిటన్నదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.


# నిజాంల నాటి చెరువుకు ప్రాణం పోసిన హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)

ఇలా పాతబస్తీకే మణిహారంగా బమ్ రుక్న్ ఉద్‌దౌలా చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. జనవరిలో ఈ చెరువును ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం బమ్‌రుక్న్‌ఉద్‌దౌలా చెరువు అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కాలగర్భంలో కలిసిపోయిందనుకున్న చరిత్రకు ప్రాణం పోస్తున్నాం.. ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అక్కడ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులను ఆదేశించారు. చెరువుకు స్థానికులు సులభంగా చేరుకునేలా రహదారులతో పాటు ప్రవేశ ద్వారాలుండాలని సూచించారు. చెరువు చుట్టూ బండ్‌పై వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించారు. చెరువు లోపలి వైపు ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. చిన్నారులు ఆడుకునేందుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న ప్లే ఏరియాలను పరిశీలించారు. వృద్ధులు సేద దీరే విధంగా అక్కడ గజబోలు నిర్మాణాలు నలువైపులా ఉండేలా చూడాలన్నారు. పార్కులు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాట్లను పరిశీలించారు.

### విహార కేంద్రంగా తీర్చిదిద్దాలి

కాంక్రీట్ జంగిల్‌గా నగరాలు మారిపోతున్న




వేళ.. పాతబస్తీలో నేషనల్ పోలీస్ అకాడమీకి చేరువలో అభివృద్ధి చేస్తున్న బమ్‌రుక్న్‌ఉద్‌దౌలా చెరువు విహార కేంద్రంగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీర్చిదిద్దాలన్నారు. ఔషధ గుణాలున్న వృక్ష జాతితో పాటు.. మొక్కలను చెరువు చుట్టూ నాటాలని సూచించారు. పచ్చిక బైళ్లతో పార్కులు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. బయటకు చెరువు పరిసరాల్లో ఉన్న ఉష్ణోగ్రతల్లో తేడా తెలిసేలా.. పచ్చని వాతావరణం ఉండేలా చూడాలన్నారు. నిజాంల కాలంలో చెరువు నిర్మాణంలో వాడిన రాతిని వినియోగించి కట్టడాన్ని పటిష్టం చేయాలన్నారు. ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్‌లు విశాలంగా ఉండేలా చేపట్టిన నిర్మాణాలను చూశారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్ ఇలా 10 కిలోమీటర్ల మేర చెరువుకు వర్షం నీరు వచ్చేలా ఇన్‌లెట్లు నిర్మించాలని.. ఈ ప్రాంతంలో వరద కష్టాలకు ఈ చెరువు చెక్‌పెట్టేలా చూడాలని సూచించారు. సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నారు.

### చరిత్రను చాటేలా....

1970లో మూడవ నిజాం సికందర్ జాహ్ పాలనలో అప్పటి ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్ ఉద్ దౌలా ఈ చెరువును నిర్మించారని.. అందుకే బమ్‌రుక్న్‌ఉద్‌దౌలా చెరువు పేరు వచ్చిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. తాగు నీటి అవసరాలను తర్చేలా 104 ఎకరాల మేర ఈ చెరువు విస్తరించి ఉందని చరిత్ర చెబుతోంది. కాలక్రమంలో చెరువు విస్తీర్ణం తగ్గుతూ హెచ్ ఎం డీ ఏ ఈ చెరువును 17.05 ఎకరాలుగా నిర్ధారించింది. చివరికి 4.12 ఎకరాలుగా మిగిలిపోయింది. హైడ్రా గత ఏడాది ఆగస్టులో ఆక్రమణలను తొలగించింది. హెచ్ ఎం డీ ఏ పేర్కొన్న విధంగా పూర్తి స్థాయిలో భూమి అందుబాటులోకి తెచ్చింది. ఆక్రమణలు తొలగిస్తున్నప్పుడు అనేక అవరోధాలను అధిగమించి.. విమర్శలను ఎదుర్కొంది. అలా విమర్శించిన వారే ఔరా అనేట్టు హైడ్రా ఈ చెరువును అభివృద్ధి చేసింది. ఇప్పుడు స్థానికులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కలలో కూడా ఊహించడం కష్టంగా ఉన్న ఈ ప్రాంతానికి ఇంత అందాన్ని తీసుకువచ్చిన హైడ్రాకు అభినందనలు తెలుపుతున్నారు.

### చరిత్రను పరిశీలిస్తే..

అడుగడుగునా చారిత్రక ఆనవాళ్లు, ఎన్నో విశేషాలు స్థానికంగా ఉన్న వృద్ధులు పలు విధాలుగా వివరిస్తున్నారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్, కాటేదాన్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ఈ చెరువుకు చేరేదని చెబుతున్నారు. నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్‌ను రాజులు, బమ్‌రుక్న్‌ఉద్‌దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని చెబుతున్నారు. అలాగే బమ్‌రుక్న్‌ఉద్‌దౌలా చెరువులో వనమూలికల చెట్లు, కొమ్మలు వేసి.. ఆ దిగువన నిర్మించిన బావిలోకి వచ్చిన ఊట నీటిని తాగేందుకు నిజాం పాలకులు వినియోగించేవారని మరి కొంతమంది వివరిస్తున్నారు. ఔషధగుణాలున్న ఈ నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారంటున్నారు. అంతే కాదు.. ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని.. ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారని.. ఇందుకోసం అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లేవారంటున్నారు. ఇలా ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు సంబర పడుతున్నారు.

# ఉపాధి హామీని కాపాడుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభలో సమగ్ర చర్చ లేకుండా హడావుడిగా బిల్లులను ఆమోదింపజేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇది కార్మికుల హక్కులపై ప్రత్యక్ష దాడిగా ఆమె అభివర్ణించారు. ఉపాధి హామీ పథకంలో పని చేసే వారిలో తొంబై శాతం మంది ఎస్సీ, ఎస్టీలు మరియు మహిళలేనని, కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల వారి ఆర్థిక భద్రత, ఆత్మగౌరవం తీవ్రంగా దెబ్బతింటాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గితే వలసలు పెరిగి సామాజిక అసమానతలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, సర్పంచులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని ఉపాధి హామీ చట్టాన్ని కాపాడేందుకు తమ స్వరం వినిపించాలని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ తుది దశకు చేరుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాబోయే పది రోజుల్లోనే దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇప్పటికే లోతుగా చర్చించామని మంత్రి పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన చిక్కుల వల్ల కొంత ఆలస్యమైందని అయితే వాటన్నింటినీ అధిగమించి వచ్చే ఏడాది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం తరపున తీపి కబురు అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యతని ఆయన ఉద్ఘాటించారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం నాయకులను, సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

(మొదటి పేజీ తరువాయి)

రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన 26వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని.. ముందస్తు ప్రణాళికతోనే వారిలో విశ్వాసం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ పీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని చెప్తూ కమిషన్ ఛైర్మన్, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందించారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని.. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకూ ప్రతి దశ స్పష్టంగా ఉండాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని.. వాటిని కట్టడి చేసేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు, నైతిక శిక్షణ అవసరమని సూచించారు. రిజర్వేషన్లు సంఖ్యలకే కాదని, వాస్తవిక ఫలితాలు ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు.

# నేనైతే రేవంత్‌తో ఫుట్‌బాల్ ఆడుకుంటా

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ ఇంట్లోని మహిళలను, పిల్లలను, మనువడి గురించి నేను మాట్లాడను. రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబ సభ్యుల విషయంలో నేను చిల్లర రాజకీయాలు చేయనన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ కు హనీమూన్ ముగిసింది. ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తారు .కేసీఆర్ ఆదివారంఅన్ని విషయాలపై దిశానిర్దేశం చేస్తారని అన్నారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ మరోసారి ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కి హనీమూన్ ముగిసిందంటూ ఆయన ఎద్దేవా చేశారు. శనివార తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సంద్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. లోకల్ బాడీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మెంబర్ షిప్ కార్యక్రమం ఉంటుంది. కేసీఆర్ బహిరంగ సభలపై రేపటి సమావేశంలో నిర్ణయం ఉంటుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు...కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో ప్రెస్ మీట్ పెట్టి.. బీఆర్ఎస్ లోనే ఉన్నామనటం పెద్ద కామెడీగా ఉంది. పంచాయతీ ఎన్నికల విషయంలో రేవంత్ చెప్తోన్న 66శాతం నిజమైతే.. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైపోల్స్ కు రావాలి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ గా నేను ఫెయిల్ కాదు. నేను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక 32జిల్లా పరిషత్, 136మున్సిపాలిటీలు గెలిచాము. రేవంత్ సీఎం అయ్యాక.. సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా గెలిపించలేదు. నేను ఐరన్ లెగ్ కాదు.. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలే ఐరన్ లెగ్‌లు. పంచాయతీ ఎన్నికల దెబ్బకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించరు. మొదట మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారు. అలానే గ్రేటర్‌లో మున్సిపాలిటీల విలీనం సక్రమంగా జరగలేదు. జీహెచ్ఎంసీని మూడు కార్పోరేషన్లు చేయాలనేది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. అయితే గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు పెట్టాలనే దానిపై కూడా సీఎంకు స్పష్టత లేదు. 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఏమీ లేదని రేవంత్ కు అర్థమైంది. రేవంత్ పాలనకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. కాంగ్రెస్ పాలన దెబ్బకు పరిశ్రమలు ఆంధ్రకు వెళ్ళిపోతున్నాయి. విరూపాక్ష అనే కంపెనీ కర్నూలుకు వెళ్లింది. కాంగ్రెస్ పాలనపై ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. టైమ్ కోసం ఎదురు చూస్తున్నారు. సరైన సమయంలో కాంగ్రెస్ కు, రేవంత్ రెడ్డికి ప్రజలు సరైన తీర్పు ఇస్తారు. ఇక 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇవ్వమని చెప్పటానికి రేవంత్ ఎవరు?. మేము పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం, అసెంబ్లీ ఎన్నికల్లో 30శాతం సీట్లు బీసీలకు ఇచ్చాము.

ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదు. మార్కెట్ యార్డ్ లు బీసీలకు ఇచ్చాము. అలానే విద్యా, ఉపాధిలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరని అన్నారు. అఖిలేష్ యాదవ్ తో ఫ్రెండ్లీగా ఉంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావుకు బాధ ఎందుకన్నారు.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి మాత్రమే లోపాయికారి ఒప్పందం ఉంది. తెలంగాణ కాంగ్రెస్ కు ఏటీంగా మారిందని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్వయంగా అన్నారు. ఢల్లీలో బీజేపీ ఎంపీ దుబే గృహప్రవేశానికి తెలంగాణ సీఎం ఎందుకు వెళ్లారో రామచంద్రరావు చెప్పాలి. ఢల్లీలో రేవంత్ రెడ్డి విందులు, వినోదాలు ఎవరి ఇళ్ళల్లో జరుగుతున్నాయో మాకు తెలుసు. దేశ రాజధాని ఢల్లీలోని తుగ్లక్ రోడ్ లో రేవంత్ రెడ్డి ఇల్లు రీమోడల్ చేయించింది బీజేపీ ఎంపీనే. తెలంగాణ సీఎం రేవంత్ .. ఒక కాలు కాంగ్రెస్ లో.. మరొక కాలు బీజేపీలో ఉంచారు. కిషన్ రెడ్డితో మాకు అండర్ స్టాండిరగ్ ఉందని అంటున్నారు. కిషన్ రెడ్డి మాకు చేసింది ఏంటో చెప్పాలి' అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మల్లాపూర్‌లో బస్తీ బాటతో మంచి నీటి సమస్యకు కృషి





◆ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** "బస్తీ బాట" కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా మల్లాపూర్ జలమండలి అధికారి ఏఈ సిరాజ్‌తో కలిసి కె.ఎల్. రెడ్డి నగర్ కాలనీ, భవాని నగర్ కాలనీ, హెచ్‌సీఎల్ కాలనీల్లో పర్యటించారు.ప్రాంతీయుల నుంచి తాగునీటి సమస్యలపై వివరాలు తెలుసుకున్న నెమలి అనిల్ కుమార్, సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. అతి త్వరలో నీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యేలా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ఏఈ సిరాజ్‌కు సూచించారు.ఈ కార్యక్రమం లో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోయలకొండ రాజేష్, సంయుక్త కార్యదర్శి ఉండం శ్రీనివాస్, కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, లైన్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.





# అయ్యప్ప స్వామి మహాపడి పూజా మహోత్సవంలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**మల్లాపూర్, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కె.ఎల్. రెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్లో అరుణోదయ కళా సంస్కారిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ అయ్యప్ప స్వామి మహా పడి పూజా మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం, సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావాన్ని బలపరుస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అరుణోదయ కళా సంస్కారిక వేదిక అధ్యక్షులు సి. రాధాకృష్ణన్, కార్యదర్శి సునీష్ జాకోబ్, కోశాధికారి ఎం. బిజూ కుమార్, కె.ఎల్. రెడ్డి నగర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్, వి.ఎస్. ప్రకాష్ రెడ్డి, మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దంతూరి రాజు గౌడ్, కోయగూర బాలరాజ్, ఎస్.వి. కిట్టు, వి. శ్రీనివాస్, కె. రాజేష్, రుపేందర్ రెడ్డి, కె. సురేష్, ఎం. జయంత్ గౌడ్, వంగవీటి ప్రిన్కు, వినీష్ యాదవ్తో పాటు స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రతి నెల మొదటి ఆదివారం అంబేద్కర్‌కు దండ కార్యక్రమానికి శ్రీకారం

◆ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
◆ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి



**హైదరాబాద్,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టుతున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు పిడమర్తి రవి తెలిపారు.నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని, జనవరి మొదటి ఆదివారం నుంచి ప్రతి నెల మొదటి ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు దండ వేయడం ద్వారా ఆయన సిద్ధాంతాలు, ఆలోచనలు ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ వాదులు ఎక్కడ ఉన్నా, వారి వారి ప్రాంతాల్లో స్వచ్ఛందంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, న్యాయం, సామాజిక సమతా భావాలను పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పిడమర్తి రవి పేర్కొన్నారు. అంబేద్కర్ సిద్ధాంతాలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రజల నిత్య జీవితంలో అమలయ్యేలా చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా యువత, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు అంబేద్కర్ ఆలోచనలపై అవగాహన పెంచుకుని, సామాజిక మార్పుకు భాగస్వాములవ్వాలని ఆయన కోరారు. అంబేద్కర్ చూపిన రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో నాటాలని ఆయన అభిప్రాయపడ్డారు.జనవరి మొదటి వారంలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించనున్నట్లు పిడమర్తి రవి తెలిపారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ వాదులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# కేటీఆర్‌ను కలిసిన కన్మనూర్ బీఆర్ఎస్ నాయకులు

**అడ్డాకల్,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** అడ్డకల్ మండలం కన్మనూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా తాజా సర్పంచ్ భర్త లక్ష్మీ వెంకటస్వామి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజవర్ధన్ రెడ్డి, విద్యా సాగర్, వెంకటేష్ తదితరులు కేటీఆర్ ను కలిశారు. గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు 7 మంది వార్డ్ మెంబర్ల గెలుపుకు కృషి చేసిన గ్రామ నాయకులను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే భవిష్యత్తులో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రానుందని, అందరూ ధైర్యంగా ఉండాలని సూచిస్తూ.. సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన పార్టీ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.



# చిన్నారిని ఆశీర్వదించిన డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి

**వనపర్తి,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌లో ఐవైసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పసుపులేటి సాయి నికేష్ కుమారుడు మాస్టర్ రుద్రాంశ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిత్య రెడ్డి గారు చిన్నారి ఆయురారోగ్యాలతో, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, మిత్రులు, పార్టీ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజలకు ఇబ్బంధులు కలగకుండా డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి



◆ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

**చిల్కానగర్, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ అభివృద్ధిలో వేగంగా ముందుకు సాగుతోందని డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు.డివిజన్ పరిధిలో రూ.90 లక్షల వ్యయంతో బ్యాంక్ కాలనీ నుంచి సాయిరాం నగర్ కాలనీ వరకు నాలుగు ఫీట్ల వెడల్పుతో నిర్మిస్తున్న బాక్స్ డ్రెయిన్ పనులను ఆమె జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ శాఖ అధికారుల తో కలిసి శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డ్రెయిన్ నిర్మాణ పనుల సమయంలో కాలనీ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్ణయిత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ డీఈ, ఏఈల పర్యవేక్షణలో పనులు జరగాలన్నారు. నాణ్యతలో ఎలాంటి లోపాలు తలెత్తినా కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎదుల్ల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాలకృష్ణ గౌడ్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బంటి గౌడ్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలి




◆ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు

**వనపర్తి,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించినందుకు వ్యతిరేకంగా టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ..ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు ఎంతో ప్రయోజనం పొందుతున్నారని, అలాంటి ప్రజాప్రయోజన పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ పేరు ఉపాధి హామీ పథకానికి గౌరవాన్ని తీసుకువచ్చిందని, అలాంటి మహానుభావుని పేరును తొలగించడం సమంజసం కాదని అన్నారు. మహాత్మా గాంధీ స్వరాష్ట్రం గుజరాత్ అనే విషయాన్ని కూడా పట్టించుకోకుండా మోడీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం అన్యాయమని మండిపడ్డారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీకి ఎలాంటి పాత్ర లేదన్న విషయం దేశ ప్రజలందరికీ తెలుసునని అన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాత్మా గాంధీ పేరును ఉపాధి హామీ పథకంలో యథాతథంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐపీసీ వివిధ విభాగాల రాష్ట్రాధిపతులు సందీప్ భూషణ్, శశాంక్ పసుపులేటి, అబ్దుల్లా బకరాన్, సీనియర్ ఏఐపీసీ సభ్యులు ఇర్ఫాన్ అజీజ్, కార్తిక్ రెడ్డి ఎం, అడ్వకేట్ జగన్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేముల ఘటన నిందితులను తక్షణమే ఎన్కౌంటర్ చేయాలి

జిల్లా బిఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు పానుగంటి సురేష్ కుమార్



**వనపర్తి,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల చెందిన మాల ప్రవళిక అనే దళిత యువతిని మద్యం మత్తులో అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు బాధ్యులైన కాంగ్రెస్ యువకులను తక్షణమే ఎన్కౌంటర్ చేయాలని వనపర్తి జిల్లా బిఆర్ఎస్ ఎస్సీ సెల్ విభాగం డిమాండ్ చేసింది.ఈ సందర్భంగా జిల్లా బిఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు పానుగంటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ..దిశా చట్టం తరహాలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలపై జరుగుతున్న సామూహిక అత్యాచారాలు, హత్యలు రాష్ట్రంలో శాంతిభద్రతలపై ప్రశ్నార్థకంగా మారాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులకు అత్యంత కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోని పక్షంలో జైలు భరోసా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ప్రవళిక కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని జిల్లా బిఆర్ఎస్ ఎస్సీ సెల్ స్పష్టం చేసింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖలో జాయింట్ డైరెక్టర్ వ్యవహారంపై బిఎస్ఎఫ్ తీవ్ర ఆరోపణలు

- 18 నెలలుగా నిర్వీర్యంగా ఉంచిన అధికారికి వేతనాలు
- అలవెన్సుల పేరిట సుమారు రూ.90 లక్షల ప్రజాధనం ఖర్చైనట్టు ఆరోపణ.

**హైదరాబాద్,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖలో జాయింట్ డైరెక్టర్ వ్యవహారం ఇప్పుడు కేవలం నిర్వీర్య పరిపాలన అంశంగా కాకుండా, అవినీతి, అధికార దుర్వినియోగం, మహిళా అధ్యాపకుల పట్ల అవమానకర ప్రవర్తన, అలాగే తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుపై నిర్లక్ష్యంగా మారిందని బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్ ఆరోపించారు.
గత 18 నెలలుగా సంబంధిత అధికారి ఎటువంటి కీలక పరిపాలనా లేదా అకాడమిక్ బాధ్యతలు లేకుండా, కేవలం ఫ్లోర్ ఇన్‌ఛార్జ్ మరియు బీరువా ఇన్‌ఛార్జ్ పనులకే పరిమితమై ఉన్నారని తెలిపారు. అయినప్పటికీ వేతనం, అలవెన్సుల రూపంలో నెలకు సుమారు 5 లక్షల మేర చెల్లింపులు జరుగుతూ ఇప్పటివరకు దాదాపు 90 లక్షల ప్రజాధనం తెలంగాణ ఖజానా నుంచి ఖర్చైనట్టు పేర్కొన్నారు. ఈ విషయమై ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
తెలంగాణలోని 56 పాలిటెక్నిక్ కళాశాలల్లో 36 కళాశాలలు రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకుండా కొనసాగుతున్నాయని తెలిపారు. కళాశాలలకు సీనియర్ అకాడమిక్ నాయకత్వం అత్యవసరమైన పరిస్థితిలో ఒక సీనియర్ ప్రిన్సిపాల్‌ను నిర్వీర్యంగా ఉంచడం విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడమేనని వ్యాఖ్యానించారు.
శాఖలో మరిన్ని ఆందోళన కలిగించే అంశాలు చర్చకు వస్తున్నాయని తెలిపారు. సంబంధిత అధికారి మై హోమ్ భుజాలో ఖరీదైన నివాసం కొనుగోలు చేసినట్లు శాఖ వర్గాల్లో వినికిడి ఉందన్నారు. అలాగే కొత్తగా రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణలో ముందస్తు తేదీలతో ఆర్డర్లు ఇచ్చారని, ఒక ఐఏఎస్ అధికారి సహకారంతో పోస్టింగులు జరిగాయని డిపార్ట్మెంట్‌లో చర్చ జరుగుతోందని తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్లకు సీఏఎస్ ఇప్పిస్తామని చెప్పి వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.
ఇలాంటి పరిణామాల నేపథ్యంలో అప్పట్లో కమిషనర్ సంబంధిత అధికారికి ఉన్న అధికారాలను ఉపసంహరించి, కేవలం ఫ్లోర్ మరియు బీరువా ఇన్‌ఛార్జ్ బాధ్యతలకే పరిమితం చేశారనే అంశం కూడా శాఖలో చర్చనీయాంశంగా మారిందని తెలిపారు.



మహిళా అధ్యాపకుల పట్ల సంబంధిత అధికారి ప్రవర్తన తీవ్ర అభ్యంతరకరంగా ఉందని ఉద్యోగులు వాపోతున్నారని చెప్పారు. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన మహిళా లెక్చరర్లతో అవమానకరమైన, కఠినమైన భాషను ఉపయోగించిన ఘటనలు ఉన్నాయని, క్యాన్సర్ బాధితురాలు, బాలింతతో కూడా అనుచితంగా మాట్లాడిన ఘటనలు శాఖలో తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయని తెలిపారు.
ఇంకా, ఆయన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా తెలంగాణ ప్రాంతం పట్ల, ఇక్కడి ప్రజల పట్ల, ముఖ్యంగా తెలంగాణ విద్యార్థుల పట్ల అనురాగం చూపడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారని చెప్పారు. కులాల వారీగా అధ్యాపకులను విభజిస్తూ అంతర్గత రాజకీయాలకు పాల్పడుతున్నారని, దీని వల్ల శాఖలో ప్రశాంత వాతావరణం దెబ్బతింటోందని పేర్కొన్నారు.
ఈ పరిస్థితుల నేపథ్యంలో బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ – తెలంగాణ అన్ని అంశాలపై సమగ్ర, స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ప్రజాధనాల దుర్వినియోగంపై బాధ్యతాయుత చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారిని ప్రిన్సిపాల్ లేని కళాశాలలో నియమించి, డైరెక్టరేట్‌లో కొత్త సీనియర్ ప్రిన్సిపాల్‌ను జాయింట్ డైరెక్టర్‌గా నియమించాలని ఉద్యోగులు కోరుతున్నారని తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖలో పారదర్శకమైన, బాధ్యతాయుత పరిపాలన తీసుకురావాలని స్పష్టం చేశారు.తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

# బేతుపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



**సత్తుపల్లి, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. బేతుపల్లి గ్రామానికి చెందిన కర్లపూడి శ్రీనివాసరావు (45) (తండ్రి: అప్పారావు) బేతుపల్లి ప్రాథమిక పాఠశాల రోడ్డు వద్ద నిలుచున్న సమయంలో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొని అక్కడి నుంచి వెళ్లిపోయింది.
ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు గాయపడగా, స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే సత్తుపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల కృష్ణ, పైలెట్ రాధాకృష్ణ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
సకాలంలో స్పందించి బాధితుడిని ఆసుపత్రికి చేర్చిన 108 సిబ్బందిని 108 సర్వీస్ జిల్లా మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, మూడు జిల్లాలను నిరంతరం పర్యవేక్షిస్తున్న ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్‌తో పాటు బేతుపల్లి గ్రామస్తులు, ప్రయాణికులు అభినందించారు.

# నావికాదళ దినోత్సవం సందర్భంగా నాచారంలో క్రీడా పోటీలు





**నాచారం, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** నావికాదళ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాచారంలో మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో కబడ్డీ, క్యారమ్స్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో నాచారంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో విజేతలైన జట్లకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం క్రీడలను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. పాఠశాలలు కూడా విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. యువత డ్రగ్స్‌కు బానిస అవుతున్న పరిస్థితుల నుంచి బయటపడేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని చెప్పారు. మొబైల్ గేమ్‌లకు దూరంగా ఉండి గ్రౌండ్ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. నావికాదళ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, ఎస్ఎస్ఎస్ యువసేన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాచారం స్థానిక నేతలు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన మహేష్ గౌడ్



- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు పర్యవేక్షణ

**కుషాయిగూడ, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా మున్సిపాలిటీలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సూచన మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో కుషాయిగూడ ప్రాంతంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మహేష్ గౌడ్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్ని విధాలుగా నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో చల్ల వెంకటేష్ జనార్ధన్, వీరేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం నుంచి రజబ్ నెల ప్రారంభం సందర్భంగా..

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 20,(తెలంగాణ ముచ్చట్లు):** రజబ్ మాసం ఆత్మశుద్ధికి తొలి అడుగు.. రమజాన్ విజయానికి పునాది
ప్రకృతి ఒడిలో వసంతం రాకముందే పూల పరిమళం గాలిలో కలిసినట్లు.. రమదాన్ అనే దివ్య మాసం రాకముందే విశ్వాసుల అంతరాత్మలను మేల్కొలిపే పవిత్ర నాదం రజబ్. ఇస్లామిక్ కాలమానంలో ఈ మాసం ఒక నిశ్శబ్ద విప్లవం. ఇది కేవలం రోజుల గణన కాదు, రమదాన్ అనే మహా సౌధానికి వేసే ఆధ్యాత్మిక పునాది.
ఆకాశ వీధిలో రజబ్ చంద్రుడు మెరిసిన వేళ, అల్లాహ్ (సు.వ) కారుణ్య ద్వారాలు బార్లా తెరుచుకుంటాయి. ఈ నెల 'అల్లాహ్ యొక్క మాసం'. ఎండిపోయిన కొమ్మ చిగురించినట్లు, పాపభారంతో అలసిపోయిన హృదయం ఈ మాసంలో చేసే 'ఇస్తిగ్‌ఫార్' (క్షమాపణ)తో తిరిగి పవిత్రతను సంతరించుకుంటుంది. రమదాన్ పండుగలో మనం పుణ్యాల పంట కోయాలంటే, రజబ్ మాసంలోనే పశ్చాత్తాపం అనే హృదయ క్షేత్రాన్ని దున్ని, సత్కార్యాల విత్తనాలు నాటాలి.
దైవ కారుణ్యం జలపాతంలా కురిసే ఈ అద్భుత సమయంలో, మనల్ని మనం శుద్ధి చేసుకుంటూ, ఆ సృష్టికర్తకు మరింత చేరువయ్యే దిశగా అడుగులు వేద్దాం. రజబ్ ఇచ్చే ఈ ఆధ్యాత్మిక పిలుపును అందుకుందాం...
విశ్వాసపు నీలాకాశంలో ఆశల నవకిరణాలు విరబూస్తున్నాయి. ఆధ్యాత్మిక వసంతానికి స్వాగతం పలుకుతూ, సోమవారం నుండి 'రజబ్' మాసం మన ముంగిట నిలవబోతోంది. ఇస్లామిక్ కాలమానంలో ఏడవదైన ఈ మాసం, కేవలం నెలల పట్టికలో ఒక అంకె కాదు; అది మన ఆత్మలను కడిగి శుద్ధి చేసుకునే ఒక పవిత్ర ప్రవాహం. రాబోయే 'మహా రమజాన్' నెలకు మన హృదయ క్షేత్రాలను సిద్ధం చేసేందుకు సృష్టికర్త ప్రసాదించిన అద్భుత వరమిది.

ఖురాన్ చాటిన పవిత్రత

విశ్వసౌధానికి మూలస్తంభమైన ఖురాన్ గ్రంథంలో అల్లాహ్ (సు.వ) స్వయంగా నాలుగు నెలలను 'హరామ్' (పవిత్రమైనవి)గా ప్రకటించాడు. అందులో రజబ్ ఒకటి. ఈ కాలంలో:
- మనం చేసే ప్రతి చిరు పుణ్యకార్యానికి లభించే ప్రతిఫలం అంతులేనిది.
- అలాగే, మనం చేసే ప్రతి చిన్న పొరపాటు లేదా పాపం కూడా తీవ్రమైనదిగా పరిగణించబడుతుంది.

"ఈ పవిత్ర మాసాల్లో మీకు మీరు అన్యాయం చేసుకోకండి" అన్న అల్లాహ్ ఆజ్ఞకు అర్థం——చెడుకు దూరంగా, చిత్తశుద్ధికి దగ్గరగా ఉంటూ మనల్ని మనం సంస్కరించుకోవడమే.

రజబ్: మూడు విశిష్టతలు

ఈ మాసానికి ముప్పేటలా అల్లుకున్న మూడు గొప్ప గౌరవాలు ఉన్నాయి:
1. అల్లాహ్ యొక్క మాసం: కారుణ్య మూర్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అమృత వాక్కుల ప్రకారం: "రజబ్ అల్లాహ్ యొక్క మాసం, షాబాన్ నా మాసం, రమజాన్ నా ఉమ్మత్ (ప్రజల) మాసం." అంటే, సృష్టికర్తతో మన బంధాన్ని దృఢపరుచుకోవడానికి ఇది అత్యంత అనువైన సమయం.
2. చరిత్రకు ప్రాణం పోసిన మాసం: మానవాళి చరిత్రను మలుపు తిప్పిన రెండు అద్భుతాలు ఈ మాసంలోనే చోటుచేసుకున్నాయి. ఒకటి, మానవాళి మార్గదర్శి ఆమినా అమ్మ గర్భాన అడుగుపెట్టడం. రెండు, 'ఇస్రా మరియు మిరాజ్'——ప్రవక్త వారు మక్కా నుండి జెరూసలేంకు, అక్కడి నుండి ఏడు ఆకాశాలను దాటి అల్లాహ్ సన్నిధికి చేరుకున్న మహా ప్రయాణం. మనకు నిత్యం తోడుండే 'నమాజ్' అనే బహుమతి లభించింది ఈ మాసంలోనే.
3. కారుణ్య వర్షం (రజబ్ అల్ అసబ్): దీనిని 'ఆశీర్వాదాల జల్లు కురిసే నెల' అని పిలుస్తారు. ఎడారిలో చినుకు పడితే నేల పులకించినట్లు, అల్లాహ్ కరుణాకటాక్షాలు కురిసి పాపుల హృదయాలు పశ్చాత్తాపంతో (తౌబా) పవిత్రమవుతాయి.

ఆధ్యాత్మిక సాగు: రమజాన్ కోసం సన్నద్ధం

ధార్మిక పండితులు చెప్పినట్లు: "రజబ్ విత్తనాలు నాటే నెల, షాబాన్ నీరు పోసే నెల, రమజాన్ పంట కోసే నెల." రమజాన్ అనే మధుర ఫలాన్ని అందుకోవాలంటే, నేడే మనం ఈ పనులు చేయాలి:
- ఇస్తిగ్‌ఫార్ (క్షమాపణ): మన మనసుపై పేరుకుపోయిన పాపపు పొరలను కడిగేయడానికి ఎక్కువగా క్షమాపణ వేడుకోవాలి.
- దుఆ (ప్రార్థన): రజబ్ మొదటి రాత్రి చేసే ప్రార్థన అల్లాహ్ వద్ద తిరుగులేకుండా స్వీకరించబడుతుంది. ప్రవక్త వారు నేర్పిన ఈ దుఆను మననం చేసుకుందాం:



"ఓ అల్లాహ్! రజబ్ మరియు షాబాన్‌లలో మాకు శుభాలను ప్రసాదించు.. మమ్మల్ని క్షేమంగా రమజాన్ వరకు చేర్చు."
- దానధర్మాలు: విధిగా చేసే నమాజులతో పాటు ఐచ్ఛిక ప్రార్థనలు (నవాఫిల్) చేస్తూ, ఆకలితో ఉన్నవారిని ఆదుకుంటూ పుణ్యాల రాశిని పెంచుకుందాం.
- ఉపవాస దీక్ష: సోమ, గురువారాల్లో లేదా నెల మధ్యలో వచ్చే 'అయ్యామె బీజ్' (13, 14, 15 తేదీలు) రోజుల్లో ఉపవాసం ఉంటూ శరీరాన్ని, మనసును రమజాన్ రోజాలకోసం అలవాటు చేద్దాం.

రజబ్ మాసం మనకు లభించిన ఒక ఆధ్యాత్మిక చికిత్స. మన అలవాట్లను మార్చుకోవడానికి, అల్లాహ్‌కు మరింత దగ్గరవ్వడానికి ఇదొక సువర్ణావకాశం. హృదయాలను శుద్ధి చేసుకుందాం.. పుణ్యాల పంటకు పునాదులు వేద్దాం.ఆ అల్లాహ్ మనందరి ప్రార్థనలను ఆలకించి, ఈ మాసం ద్వారా మన జీవితాల్లో వెలుగులు నింపాలని, మనల్ని రమదాన్ ఆశీర్వాదాలకు యోగ్యులుగా చేయాలని కోరుకుందాం. ఆమీన్!

**ముహమ్మద్ ముజాహిద్, 9640622076**

# సత్తుపల్లిలో ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం.!




ధ్యాన అవగాహన ప్రదర్శనలో పాల్గొన్న వివిధ ఆధ్యాత్మిక సంస్థలు.

**సత్తుపల్లి, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ ధ్యాన దినోత్సవం (డిసెంబర్ 21)ను పురస్కరించుకుని శనివారం సత్తుపల్లిలో ఆధ్యాత్మిక, విద్యా, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ధ్యాన అవగాహన ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి పాత సెంటర్ వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నవారు ప్రతిరోజూ ధ్యానం చేస్తామని, మనసును ప్రశాంతంగా, సానుకూలంగా ఉంచుకుంటామని, భావోద్వేగాలను నియంత్రిస్తూ శాంతియుతమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. సప్తరుషి మార్క్‌బా పిరమిడ్ ధ్యాన మందిరం, రామచంద్ర మిషన్, రామకృష్ణ యోగ సమితి, బ్రహ్మకుమారీస్, సత్యసాయి సేవ సమితి, సత్తుపల్లి లయన్స్ క్లబ్ తదితర ఆధ్యాత్మిక సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ధ్యానం ప్రాముఖ్యతను ప్రజలకు మరింత విస్తృతంగా తెలియజేయాలనే ఉద్దేశంతో 2024 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగానే ఈ అవగాహన ప్రదర్శన చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం జరిగిన సమావేశంలో పాల్గొన్న ధ్యాన, ఆధ్యాత్మిక ప్రముఖులు మాట్లాడుతూ ధ్యానం మనసుకు శాంతిని చేకూర్చి ఏకాగ్రతను పెంపొందిస్తుందని, ఒత్తిడిని తగ్గించి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా నేడు గుడిపాడు రోడ్డులోని పిరమిడ్ ధ్యాన మందిరంలో అన్ని ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక ధ్యాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# సెలవుల వేళ అప్రమత్తంగా ఉండాలి.!




- కోళ్ల పందేలు, జూదంపై కఠిన చర్యలు.
- సీఐ టి శ్రీహరి.

**సత్తుపల్లి, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రాబోయే డిసెంబర్ 31, సంక్రాంతి పండుగల సందర్భంగా వరుస సెలవులు ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి సీఐ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగలకై స్వగ్రామాలకు వెళ్లే సమయంలో ఇండ్లకు తాళాలు వేసి, ఇంట్లో ఎలాంటి విలువైన ఆభరణాలు లేదా నగదు ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఖాళీగా వదిలే ఇండ్ల వివరాలను ముందుగా పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. అలాగే పండుగల సందర్భంగా ఎవరైనా కోళ్ల పందేలు నిర్వహించినా, కోళ్లకు కత్తులు కట్టినా, జూద శిబిరాలు ఏర్పాటు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోళ్ల పందేలు లేదా జూదం నిర్వహించిన వారితో పాటు పాల్గొన్న వారిపై కూడా పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక నిఘా షీట్లు తెరవడంతో పాటు బైండ్ ఓవర్ చర్యలు చేపడతామని తెలిపారు. పండుగల సమయంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే ఎలాంటి అక్రమ కార్యకలాపాలను సహించేది లేదని, ప్రజలు పోలీసులకు సహకరించి పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

## మృతురాలి కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు



**పెద్దమందడి,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన కాసింగారి చంద్రయ్య భార్య కాసింగారి వెంకటమ్మ ఆకస్మికంగా మృతి చెందడం జరిగింది. వెంకటయ్య కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మరియు బీఆర్ఎస్ నాయకులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.
ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, మృతురాలి కుటుంబానికి రూ.5,000/ (ఐదు వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే భవిష్యత్తులో కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తమవంతు భరోసాగా ఉంటామని హామీ ఇచ్చారు. విషాద సమయంలో అండగా నిలిచిన సర్పంచ్ మరియు బీఆర్ఎస్ నాయకుల మానవీయతను గ్రామస్తులు అభినందించారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ కు ఎంపికైన తాటికాయల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని




**ధర్మసాగర్,డిసెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో తాటికాయల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఆమంచ గీతిక శ్రీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.గ్రామానికి చెందిన ఆమంచ రమేష్ కుమార్తె అయిన గీతిక శ్రీ "మున్సిపల్ నీటి లీకేజీని స్వయంచాలకంగా గుర్తించే విధానం" అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్ట్ జిల్లా స్థాయి న్యాయనిర్ణేతల ప్రశంసలు పొందింది.
హనుమకొండలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో డిసెంబర్ 18 నుండి 20 వరకు నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించగా, వినూత్న ఆలోచన, సామాజిక ప్రయోజనం, సాంకేతిక స్పష్టత అంశాల్లో అత్యుత్తమంగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.
ఈ ప్రాజెక్ట్‌కు పి. దీప్తి (భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని), జి. ఉషారాణి (జీవ శాస్త్ర ఉపాధ్యాయిని) మార్గదర్శకులుగా వ్యవహరించారు. విద్యార్థిని ప్రతిభకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీతో పాటు సీనియర్ ఉపాధ్యాయులు డి. నవీన్ కుమార్, టి. వసుందర, పి. శ్రీనివాస్, బి. రాజు, ఎస్. ఇందిరాణి, ఎన్. కల్యాణ్, పిఎస్ హెచ్ఎం బి. వెంకటేశ్వరరెడ్డి, రాజు, హేమలత అభినందనలు తెలిపారు.
రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ గీతిక శ్రీ మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి పాఠశాల పేరు ప్రతిష్ఠలు నిలబెట్టాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

# గుర్రపు డెక్క పూర్తిగా తొలగించేవరకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించవద్దు





### కార్పొరేటర్ శాంతి సాయిజన్

**నాచారం, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా మున్సిపాలిటీలో నాచారం పరిధిలోని హెచ్ఎంటి నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా దోమల సమస్య తీవ్రంగా పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణంగా హెచ్ఎంటి పెద్ద చెరువులో విస్తృతంగా పేరుకుపోయిన గుర్రపు డెక్కను కార్పొరేటర్ శాంతి సాయిజన్ పేర్కొన్నారు. హెచ్ఎంటి పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, నిర్వహణ పనులకు సంవత్సర కాలానికి కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్ ఒకసారి మాత్రమే పూర్తిగా గుర్రపు డెక్కను తొలగించి, సుమారు నాలుగు నుంచి ఐదు నెలల క్రితం ఎఫ్‌టీసీ యంత్రాన్ని అక్కడి నుంచి వేరే చెరువుకు తరలించారని తెలిపారు. అప్పటి నుంచి చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, మెయింటెనెన్స్ పనులు పూర్తిగా నిలిచిపోయాయని ఆరోపించారు.ఈ విషయమై ఎంటమాలజీ ఎస్ఈ మాధవరెడ్డిని హెచ్ఎంటి చెరువు వద్దకు కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పిలిపించారు. గుర్రపు డెక్క తొలగింపు కాంట్రాక్టును ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని సమాచారం రావడంతో, చెరువులోని గుర్రపు డెక్క పూర్తిగా తొలగించే వరకు కాంట్రాక్టర్కు ఎలాంటి బిల్లులు చెల్లించవద్దని ఎల్బీనగర్ ఇంజనీరింగ్ ఎస్ఈ అశోక్ రెడ్డికి ఫోన్ ద్వారా స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సాయిజన్ శేఖర్, విట్టల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, మోహన్ రెడ్డి, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, మక్బూల్, నర్సింగ్ రావు, వాసు, వీరాంజనేయులు, రవీందర్ రెడ్డి, రామరాజు, బాలరెడ్డి, సుభాస్కర్, యాదగిరి రెడ్డి, చంద్రశేఖర్, కొండయ్య, ఎంటమాలజీ సూపర్వైజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం






- పది రోజుల్లో అక్రిడిటేషన్ కార్డుల జీవో.
- వచ్చే ఏడాది ఇళ్ల స్థలాల కేటాయింపుపై తీపి కబురు.
- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలో మంత్రి పొంగులేటి ప్రకటన

**సత్తుపల్లి, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టుల చిరకాల సమస్యలైన అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల కేటాయింపును పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని తెలిపారు.
శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉండగా, అనివార్య కారణాలతో అత్యవసరంగా హైదరాబాద్‌కు వెళ్లాల్సి రావడంతో ఫోన్ ద్వారా జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలను వివరించారు.
రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ తుది దశకు చేరుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాబోయే పది రోజుల్లోనే దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ కార్డులు అందేలా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

**ఇళ్ల స్థలాలపై స్పష్టమైన హామీ**

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో విస్తృతంగా చర్చించామని మంత్రి వెల్లడించారు. గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన చిక్కుల కారణంగా కొంత ఆలస్యం జరిగిందని పేర్కొంటూ, వాటన్నింటినీ అధిగమించి వచ్చే ఏడాది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం తరపున తీపి కబురు అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ ప్రభుత్వ బాధ్యతని ఆయన ఉద్ఘాటించారు.
ఈ మహాసభకు అతిథిగా హాజరైన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి జర్నలిస్టుల సేవలను కొనియాడారు. సమాజంలో ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర అమూల్యమని పేర్కొంటూ, వారి సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

**సమిష్టిగా ముందుకు సాగాలి**

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించుకున్నందుకు నేతలు హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడలు అవసరం

### జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

**మేడ్చల్ మల్కాజిగిరి, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, విద్యార్థుల కు కావాల్సిన క్రీడా పరికరాలు, మైదానాలు, మౌలిక సదుపాయాలను ప్రభుత్వం ద్వారా అందిస్తామని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు.శనివారం శామీర్‌పేట్ మండలం హకీంపేటలో ఉన్న తెలంగాణ ప్రభుత్వ క్రీడల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య, నిర్వహిస్తున్న క్రీడలు, కోచ్‌ల శిక్షణ విధానం తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్, చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడల గురించి అడిగి తెలుసుకున్న ఆయన, ప్రస్తుతం ఉన్న క్రీడలకు తోడు మరే క్రీడలు కావాలని ప్రశ్నించారు. విద్యార్థులు బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, స్కేటింగ్, రైఫిల్ షూటింగ్, వాలీబాల్, సైక్లింగ్, హాకీ వంటి క్రీడలకు అవసరమైన మైదానాలు, పరికరాలు కావాలని కోరారు. వీటిని పరిశీలించి అందజేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయి క్రీడల వరకు వెళ్లే విద్యార్థులపై ప్రభుత్వం ఒక్కొక్కరిపై రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. కోచ్‌లు ఎంత శిక్షణ ఇచ్చినా, విద్యార్థుల్లో చిత్తశుద్ధి, అంకితభావం, స్వీయ క్రమశిక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. రోజురోజుకు ఆలోచనలు మారుతాయని, వాటిని ఎప్పటికప్పుడు నవీకరించుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టాలని,భవిష్యత్తు లో ఉద్యోగం గానీ, వ్యాపారం గానీ అవసరమైన సహాయాన్ని తప్పకుండా అందిస్తానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.సివిల్స్ చేయాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఎప్పుడైనా తాను అందుబాటులో ఉంటూ అవసరమైన మార్గనిర్దేశం, సలహాలు అందిస్తానని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిమ్నాస్టిక్ హాల్, క్రీడా మైదానాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు.





తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# పది రోజుల్లో అక్రిడిటేషన్లు..

- విధి విధానాలు ఖరారు చేస్తున్నాం..
- టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- జర్నలిస్టులకు మాది అనుకూల ప్రభుత్వం.. ఎమ్మెల్యే మట్టా రాగమయి
- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక, అధ్యక్ష, కార్యదర్శులుగా ఖదీర్, శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా సాగర్ దువ్వ



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ మరో పదిరోజుల్లో ప్రారంభిస్తామని రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం చివరికి అక్రిడిటేషన్ల ప్రక్రియ, వచ్చే ఏడాది జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కేటాయింపుపై తీపి కబురు చెబుతామని స్పష్టం చేశారు. ఖమ్మంలోని ఎస్ ఆర్ కన్వెక్షన్లో శనివారం నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా మహాసభలను ఉద్దేశించి ఆయన ఫోన్ లో మాట్లాడారు. మహాసభలకు హాజరయ్యేందుకు బయలుదేరిన మంత్రికి సీఎం కార్యాలయం నుంచి ఆకస్మిక పిలుపు రావడంతో హైదరాబాద్ వెళ్లారు. అనివార్య కారణాల వల్ల రాలేక పోతున్నందుకు మన్నించాలని జర్నలిస్టులను కోరిన మంత్రి..తన సందేశాన్ని ఫోన్ ద్వారా వినిపించారు. అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందని, వచ్చే పదిరోజుల్లో దీనికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. అందువల్ల ప్రత్యామ్నాయ పద్ధతుల్లో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొత్త సంవత్సరం ఆరంభంలో ఇండ్ల స్థలాల విషయమై తీపి కబురు అందిస్తామని చెప్పారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకత్వానికి అభినందనలు తెలిపారు.

**జర్నలిస్టులకు అనుకూలంగా ఉంటాం = సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి**

కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు అనుకూలంగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. తన నియోజకవర్గంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానని తెలిపారు.

**జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి..**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ నాయకుడు, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి కృషితో జర్నలిస్టులకు మంచిరోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజానికి జర్నలిస్టులు చేసే సేవ మహోన్నతమైనదని, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి ప్రదీప్ అన్నారు. పత్రికలు, చానళ్లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని, ఎవరి ప్రలోభాలకు లొంగకుండా ఉండాలని డాక్టర్ యలమంచలి రవీంద్రనాథ్ సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులు సమస్యల వెలికితీయడంలో ముందున్నారని కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ అన్నారు.

**భారీ బైక్ ర్యాలీ..**

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాసభల సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం లోగోతో కూడిన జెండాలను చేతబట్టి, డప్పులదరువులో అమరవీరుల స్థూపం వద్ద ఈ ర్యాలీని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య జెండా ఊపి ప్రారంభించారు. పాత బస్టాండ్, వైరా రోడ్, అంబేద్కర్ సెంటర్ మీదుగా ఇల్లెందు రోడ్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ మీదుగా ఎస్ఆర్ కన్వెక్షన్ సెంటర్ కు చేరుకుంది. ఈ సందర్భంగా మార్గమధ్యలో అంబేద్కర్, శ్రీశ్రీ విగ్రహాలకు యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు నివాళులర్పించారు. ఈ మహాసభలో టీడబ్ల్యూజేఎఫ్ కార్యదర్శి ఈ చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ రాజశేఖర్, బుడిగె రఘు యూనియన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

**జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఖదీర్, శ్రీనివాస రెడ్డి**

ఈ మహాసభల్లో భాగంగా టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా సయ్యద్ ఖదీర్, కార్యదర్శిగా కొత్తపల్లి శ్రీనివాస రెడ్డి, కోశాధికారిగా తేనె వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ గా సాగర్ దువ్వ, సహాయ కార్యదర్శులుగా జక్కంపుడి కృష్ణ, కూరాకుల గోపి, నాగుల్ మీరా, ఈసీ మెంబర్లుగా కొత్త యాకేష్, నూకల రామచంద్రమూర్తి, అయ్యప్ప, అంజయ్య, జీ వెంకటేశ్వర్లు, ఎస్కే జానీపాషా, మేడా సంపత్, చల్లా నర్సింహారెడ్డి, కే సుధాకర్, సయ్యద్ అంజాద్, మోహన్ రావు, బీ వెంకటేశ్వర్లు, అచ్చిరెడ్డి, నాగిరెడ్డి, మేకల రమేశ్, కరుణాకర్ రెడ్డి, చంద్రశేఖర్ ఉన్నారు. స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా బాలకృష్ణ, నాగేందర్ రెడ్డి, మధుశ్రీ ఎన్నికయ్యారు. తెలంగాణ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులుగా ఆవుల శ్రీనివాస్, రవికిరణ్ కెమెరామెన్ విభాగం అధ్యక్షునిగా ఫయాజ్, కార్యదర్శిగా గణేష్ ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శులుగా తురుగ రామచంద్రమూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ గా వీసారపు అంజయ్య, భారతి జాయింట్ సెక్రటరీ గా రామకృష్ణ నాయక్, ఈసీ మెంబర్లుగా శివారెడ్డి ఎన్నికయ్యారు. నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా పల్లా కొండల్ రావు, కందికొండ శ్రీనివాస్, బోయినపల్లి అంజయ్య, ఎన్నికయ్యారు.





# బ్రెయిని స్టార్స్ స్కూల్లో మ్యాథ్స్ ఎక్స్పో

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం సహకార నగర్ లో గల బ్రెయినీ స్టార్స్ స్కూల్ లో గణిత ఎక్స్పోను 53 డివిజన్ కార్పొరేటర్ శ్రీ విద్య ప్రారంభించారు గొప్ప గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రంనుజన్ జయంతి సందర్భంగా మ్యాథ్స్ ఎక్స్పో నిర్వహించటం జరిగిందని కరస్పాండెంట్ జైనుల్ పాషా అన్నారు ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీ విద్య మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత, ప్రతిభ ఇటువంటి ఎక్స్పో లు దోహద పడతాయి అని అన్నారు విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ప్రాజెక్టులు అందర్నీ ఆకట్టుకున్నాయి అన్నారు విద్యార్థులకు చదువుతోపాటు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన వారిలో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీవిద్య ను స్కూల్ కరస్పాండెంట్ మరియు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమం లో స్కూలు ఉపాధ్యాయులు శైలజ, సునీత, నీలిమ, మాధవి, ప్రశాంతి, నాగమణి, నగీన, రజని, ఉజ్మా విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు

# పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు, వరదల సమయంలో జాగ్రత్తలపై అవగాహన

**మేడ్చల్ మల్కాజిగిరి, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వరదలు, పరిశ్రమల ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్‌ను ఈ నెల 22వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు.చెర్లపల్లిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) స్మార్ట్ టెర్మినల్ (హైదరాబాద్ టెర్మినల్), సర్వే నెం. 183, ఫేజ్-III, మహాలక్ష్మి నగర్ ప్రాంతంలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ మాక్ ఎక్సర్సైజ్ జరగనుందని పేర్కొన్నారు.పరిశ్రమల్లో సంభవించే అగ్ని ప్రమాదాలు, వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం, ప్రాణ నష్టం తగ్గించేందుకు అవసరమైన చర్యలు, అలాగే వివిధ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై ఈ మాక్ డ్రిల్ ద్వారా ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు.మాక్ డ్రిల్‌ను పకడ్బందీగా, విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని, ఇందుకు ఐఓసీఎల్ యాజమాన్యం సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు.ఈ మాక్ డ్రిల్ ద్వారా విపత్తుల సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం తగ్గించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు.



# అద్నాన్ అభినందించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు):** బెంగళూరులో జరిగిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ ప్రథమ బహుమతి గెలుచుకున్న ఎస్ కె అద్నాన్ ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు ఈ కార్యక్రమంలో మైనార్టీ గ్రామీణ వైద్యులు వ్యవస్థాపక అధ్యక్షులు నజరుద్దీన్ మరియు గౌరవ అధ్యక్షులు హసేన్ రెజనెన్స్ స్కూల్ యాజమాన్యం మరియు మాస్టర్ ఖాసిం లాల్ జాన్ పాషా ఆఫ్రిన్ యాసిన్ పాల్గొన్నారు

# భూక్య వీరస్వామి మరణం పార్టీకి, ప్రజలకు తీరనిలోటు..



- నివాళులర్పించి ఆర్థిక సహాయం అందించిన కాంగ్రెస్ నాయకులు కట్కూరి శ్రీనివాసరెడ్డి.

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు:** భూక్య వీరస్వామి మరణం కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే కాకుండా ప్రజాసమాజానికి తీరనిలోటని కట్కూరి శ్రీనివాసరెడ్డి భావోద్వేగంగా అన్నారు. ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు భూక్య వీరస్వామి అని, ఆయన లేని లోటు ఎన్నటికీ భర్తీ కాదని పేర్కొన్నారు.గతంలో కమ్యూనిస్టు పార్టీ తరఫున వార్డు సభ్యులుగా కాకరవాయి పాలకవర్గంలో తనతో కలిసి పనిచేసిన రోజుల్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రజాసేవలో భూక్య వీరస్వామి చూపిన నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణ ప్రతి కార్యకర్తకు ఆదర్శమని అన్నారు. మాటలకన్నా పనికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తిత్వం ఆయనదని కొనియాడారు.తెలంగాణ ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ తరఫున యువతను చైతన్యపరచడంలో భూక్య వీరస్వామి కీలక పాత్ర పోషించారని తెలిపారు. గ్రామీణ యువతను సంఘటితం చేసి ఉద్యమబాట పట్టించడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. తన తండ్రి ఆశయాలను గుండెల్లో పెట్టుకుని చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీలోనే కొనసాగుతూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించారని చెప్పారు.భూక్య వీరస్వామి కుటుంబం మొత్తం కమ్యూనిస్టు పార్టీకే అంకితమై పనిచేస్తోందన్నారు ఇటువంటి నాయకులు పార్టీకి శక్తిస్థంభాలని, భవిష్యత్ తరాలకు మార్గదర్శకులని అన్నారు.ఈ సందర్భంగా భూక్య వీరస్వామి చిత్రపటానికి కట్కూరి శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అదేవిధంగా భూక్య వీరస్వామి కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేసి, ఈ కష్టకాలంలో పార్టీతో పాటు తాను కూడా ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు దంతాల బాలరాజు, సిపిఐ మాజీ ఎంపీటీసీ పిల్లల మహేష్, నల్లగట్టు దుర్గయ్య, కొత్తపెల్లి రవి వార్డు మెంబర్ వసంత, కొత్తపెల్లి ఉష, కొత్తపెల్లి చిన్న నాగన్న, కొత్తపెల్లి చిన్న రవి, గుండెబోయిన శ్రీశైలం, పల్లా వెంకటరెడ్డి, నల్లగట్టు కిరణ్, మాజీ గ్రామ సర్పంచ్ నల్లగట్టు ఎల్లయ్య, బీఎస్పీ నాయకులు నల్లగట్టు శంకర్ మహరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ అసోసియేషన్ సెక్రటరీగా..షేక్ అజీజ్ ఏకగ్రీవ ఎన్నిక..



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా షేక్ అజీజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు సంబంధించి ఖమ్మం పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్‌లో ఉన్న డీపీఆర్సీ భవనంలో సంఘ సభ్యుల సమావేశం ఘనంగా నిర్వహించారు. సమావేశానికి వివిధ జిల్లాల నుంచి అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలపై పోరాటంలో షేక్ అజీజ్‌కు ఉన్న అనుభవం, నాయకత్వ లక్షణాలు ఈ పదవికి ఆయన్ను సరైన వ్యక్తిగా నిలబెట్టాయని తెలిపారు. గతంలో ఖమ్మం జిల్లా వీఆర్ఏ జేఏసీ సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన షేక్ అజీజ్, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, శాఖాపరమైన సమస్యలపై గత ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడంలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారని సభ్యులు పేర్కొన్నారు. జూనియర్ అసిస్టెంట్లకు సంబంధించిన పదోన్నతులు, బదిలీలు, జీతభత్యాలు, కార్యాలయ వసతులు వంటి అంశాలపై సమిష్టిగా పోరాడేందుకు ఆయన నాయకత్వం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నిక అనంతరం షేక్ అజీజ్ మాట్లాడుతూ..తనపై ఉంచిన నమ్మకానికి సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ఉద్యోగుల హక్కుల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి, ప్రభుత్వంతో సమర్థవంతమైన చర్చల ద్వారా న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన తెలంగాణ రెవిన్యూ ఎమ్మార్వో అసోసియేషన్ అధ్యక్షులు తంబూరు సునీల్ రెడ్డి,తెలంగాణ రెవెన్యూ సెక్రటరీ ప్రసాద్, ట్రెజరీ క్రాంతి కుమార్ పాల్గొన్నారు..

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
ఆదివారం - 21 - డిసెంబర్ 2025




## అంతోటి రామును పరామర్శించిన బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో,డిసెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు):** మూడు రోజుల క్రితం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో కాలుకు సంబంధించి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసుకొని , కూసుమంచి మండల కేంద్రంలో తమ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్న వెలుగు దినపత్రిక విలేఖరి అంతోటి రాము ను పరామర్శించి, వారు త్వరగా కోలుకుని యధావిధిగా తన వృత్తిలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించడం జరిగినది. అదే విధంగా ఇటీవల 8 వ వార్డు యందు ఘన విజయాన్ని సొంతం చేసుకున్న క్రమంలో ఎన్నికల సంబధిత విషయాలు మరియు వార్డు సంబధిత సమస్యలు, కూసుమంచి పట్టణం సమస్యలు ప్రస్తావించడం, వాటి పరిష్కారం మార్గాలను చర్చించుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో యువ నాయకులు దామళ్ల కోటి, అడపా శివ, మహమ్మద్ తాహిర్ హుస్సేన్, మండల బీజేపీ నాయకులు పొన్నం ఉపేందర్ నాయుడు పాల్గొనడం జరిగినది.




## హక్కులు-భద్రతే టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్- 2843) లక్ష్యం

**ప్రెస్ క్లబ్ నుంచే సభ్యత్వ కార్యక్రమానికి శ్రీకారం**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, జీవన భద్రత, గౌరవాన్ని లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ - హెచ్2843) ఆధ్వర్యంలో ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు స్వచ్ఛందంగా తరలివచ్చి సంఘంలో చేరారు. ఈ సందర్భంగా టి. సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ టిడబ్ల్యూజేఎఫ్ కేవలం యూనియన్ మాత్రమే కాదని, ఇది జర్నలిస్టుల కుటుంబమని అన్నారు. వృత్తిలో ఎదురయ్యే ఒత్తిళ్లు, అవమానాలు, అనిశ్చితి పరిస్థితుల్లో జర్నలిస్టులకు అండగా నిలవడమే సంఘ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇక్కడ వ్యక్తిగత ద్వేషాలు, రాజకీయ రంగులు లేవని, జర్నలిస్టుల సమస్యలే కేంద్రబిందువని పేర్కొన్నారు. ఇతర యూనియన్లలో ఉన్న జర్నలిస్టులకు భరోసా ఇస్తూ, ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. రాబోయే రోజుల్లో అక్రిడిటేషన్, సంక్షేమ పథకాలు, జీవన భద్రత వంటి అంశాలపై నిర్మాణాత్మక ఉద్యమాలు, శాంతియుత పోరాటాలు చేపట్టేందుకు అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అర్వపల్లి నగేష్, అంతోటి శ్రీనివాస్, వందనపు సామ్రాట్, కందరబోయిన నాగకృష్ణ, అమరబోయిన ఉపేందర్, కాసోజు శ్రీధర్, కప్పల మధు, కుంభం రవికుమార్, ఈ. వెంకట రావు, ఎన్. స్వాతి, రాంబాబు, శిల్ప, శ్రీనివాస రావు, నక్క లక్ష్మయ్య, రామకృష్ణ, డి. రాంచందర్, బొల్లి రమేష్, పి. సంతోష్ కుమార్, గంటెల కుమార్, ఏ. వెంకట నరసింహారెడ్డి, గౌరవరపు జగదీష్, కొప్పు రావూరి రఘువీర్, కుక్కల నాగభూషణం, పర్సా వెంకట్ గౌడ్, దోర్నాల బాబు, షేక్ సిరాజుద్దీన్, ఇమాన్యువల్, ఎస్.కె. సొందు మియా, ఏ. మధు తదితరులు పాల్గొని టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్2843) కు సంఘీభావం ప్రకటించారు.




## రాంపల్లి డబుల్ బెడ్ రూమ్ ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని సీఐటీయూ రాస్తారోకో

**నాగారం, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** గెయిల్ ఇండియా కంపెనీ నుండి హెచ్పీసీఎల్ కంపెనీ వరకు ఉన్న రాంపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ కీసర మండల కమిటీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు, సొసైటీ సభ్యులతో కలిసి రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగ రావు మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు ప్రధాన మార్గంగా ఉన్న రహదారి గుంతలతో నిండిపోయి భారీ వాహనాల రాకపోకల కారణంగా పూర్తిగా అధ్వానంగా మారిందన్నారు. రోడ్డు మరమ్మత్తుల కోసం గతంలో అనేకసార్లు ఆందోళనలు నిర్వహించి, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు దుస్థితి వల్ల పరిసర ప్రాంతాలు దుమ్ము, ధూళితో నిండిపోయి వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు డస్ట్ అలర్జీతో అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు "దున్నపోతు మీద వాన పడినట్లు" నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గెయిల్ ఇండియా నుండి హెచ్పీసీఎల్ వరకు ఉన్న రహదారి నిత్యం ప్రమాదాలకు కేంద్రంగా మారిందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సంబంధిత అధికారులపై ఒత్తిడి పెంచి రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాంపల్లి డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు, సొసైటీ సభ్యులు, ఆర్ ఆర్ ఆర్ (త్రిబుల్ ఆర్ టీమ్) వెంకట్ లాయర్, బట్టు రామకృష్ణ, కంపెల్లి రవి, తులసి గౌడ్, ప్రసాద్ రెడ్డి, అలీభాయ్, లక్ష్మణ్ యాదవ్, హామీదా కాటూన్, ఖాన్ సాబ్, జాఫర్, శంకర్, కాంచనమాల, బానోతు నరసింహ, శ్రీనివాస్ పంతులు, సాయి, ప్రదీప్, సయ్యద్ ఖుస్మీర్ పాల్గొన్నారు.





## పాడే పట్టి.. కన్నీటి వీడ్కోలు..!

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు):** రాజకీయం అంటే కేవలం పదవులు... అధికార దర్పం మాత్రమే కాదు.. అంతకు మించిన ఆత్మీయ అనుబంధమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరూపించారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తూ... తన వెన్నంటి నడిచిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యడవల్లి రామిరెడ్డి అకాల మరణం ఆయన్ని తీవ్రంగా కలచివేసింది. శనివారం పాలేరులో జరిగిన రామిరెడ్డి అంత్యక్రియల్లో మంత్రి పాల్గొన్న తీరు అక్కడున్న వేలాది మంది కళ్లను చెమర్చింది.

**అధికార హోదా మరచి..** అంత్యక్రియల సందర్భంగా మంత్రి పొంగులేటి తన ప్రోటోకాల్‌ను పక్కన పెట్టారు. తన ప్రియతమ అనుచరుడికి కడసారి వీడ్కోలు పలుకుతూ మంత్రి స్వయంగా పాడే మోశారు. సాధారణ కార్యకర్తలు, ఇతర నాయకులతో కలిసి శ్మశాన వాటిక వరకు నడిచి తనపై ఉన్న అపారమైన గౌరవాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు. ఒక రాష్ట్ర మంత్రి హోదాలో ఉండి కూడా, తన అనుచరుడి కోసం పాడే పట్టి.. కన్నీటి వీడ్కోలు పలకడాన్ని చూసి పాలేరు ప్రజలు భావోద్వేగానికి లోనయ్యారు.

**పాలేరు శోకసంద్రం...** సీనియర్ నాయకుడు రామిరెడ్డి మృతితో పాలేరు గ్రామం మౌన రోదనతో నిండిపోయింది. వేలాదిగా తరలివచ్చిన జనవాహిని మధ్య అంత్యక్రియలు ముగిశాయి. "పార్టీ ఒక నిబద్ధత గల సీనియర్ నాయకుడిని కోల్పోయింది. నా రాజకీయ ప్రయాణంలో రామిరెడ్డి పాత్ర మరువలేనిది" అని మంత్రి ఆవేదన వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.





## సృజనాత్మకతను ప్రతిబింబించిన స్మార్ట్ కిడ్జ ఇన్స్పైర్-2025

- అబ్బురపరిచిన బాల సైంటిస్టుల సైన్స్ నమూనాలు.
- ఇన్స్పైర్ -2025 ను ప్రారంభించిన యువనేత తుమ్మల యుగంధర్
- భవిష్యత్తులో సైంటిస్టులుగా మారి సమాజానికి సేవలు అందించాలి... తుమ్మల యుగంధర్.

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఇన్స్పైర్ సృజనాత్మకతను ప్రతిబింబించాయి. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ ఇన్స్పైర్లో ఎగ్జిబిట్స్ అబ్బురపరిచాయి. అణువు నుంచి అంతరిక్షం దాకా బాల సైంటిస్టుల సైన్స్ నమూనాలు వారిలో దాగివున్న సృజనకు దర్పణం పట్టాయి. విజ్ఞాన శాస్త్రంలోని భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, ఆరోగ్యం, రవాణా మార్గాలు, అంతరిక్షం, సూర్య కుటుంబం,ప్రజల జీవన విధానం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సోలార్ ఎనర్జీ, గ్లోబల్ వార్మింగ్, నదులు, అడవుల ప్రస్థానం తదితర విభాగాలలో 200 కి పైగా సైన్స్ నమునాలను విద్యార్థులు ప్రదర్శించారు. తాము ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్ వివరాలను విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా వివరించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ ఇన్స్పైర్లో హైడ్రో ఎలక్ట్రిక్ ఎనర్జీ ఎగ్జిబిట్ ను చింతనిప్పు అభయ్ కృష్ణ, కార్బన్ ప్యూరిఫికేషన్ ఎగ్జిబిట్ ను ఎం కార్తికేయ, రైన్ డిటెక్టర్ ను జి ఆద్య, వేస్ట్ మేనేజ్మెంట్ ఎగ్జిబిట్ ను పి పవిత్ర, థర్మల్ పవర్ స్టేషన్ ఎగ్జిబిట్ ను పి ప్రణీత శ్రీ, సాటిలైట్ కమ్యూనికేషన్ ఎగ్జిబిట్ ను హెచ్ .యశస్విని విశేషంగా ఆకట్టుకున్నాయి. న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ఎగ్జిబిట్ ను టీ మనీష్, ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ ఎగ్జిబిట్ ను బీ.రుత్విక్, హైడ్రోపోనిక్స్ ఎగ్జిబిట్ ను కే క్రాంతి సుదీక్ష, స్మార్ట్ అగ్రికల్చర్ ఎగ్జిబిట్ ను బి పునర్వి, గ్లోబల్ వార్మింగ్ ఎగ్జిబిట్ ను బి విశ్వకార్తిక్, వాటర్ కన్జర్వేషన్ ఎగ్జిబిట్ ను ఆర్ మోక్షిత్ కృష్ణ, గ్రీన్ ఎనర్జీ ప్యూషన్ టి. అభిరామ్ రెడ్డి, సోలార్ సిస్టం ఎగ్జిబిట్ ను ఎం దియ, డ్రిప్ ఇరిగేషన్ ఎగ్జిబిట్ ను వీ నిహిత కుమార్, ఆర్గాన్ సిస్టం ఎగ్జిబిట్ ను బి యక్షిత్, ఎస్.కె జునైడ్, నాచురల్ క్లమిటీస్ ఎగ్జిబిట్ ను ఎన్ జస్విన్ ప్రసాద్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ డి వేదాంశ, సోలార్ పవర్ ఇరిగేషన్ ఎగ్జిబిట్ ను కె సత్య వర్ధన్, ట్రాన్స్పోర్టేషన్ ఎగ్జిబిట్ ను డీకే . మూబిన్ అలీ, టైప్స్ ఆఫ్ పొల్యూషన్ ఎగ్జిబిట్ ను శ్రీకృతి , హేమాన్ష్, ఫుడ్ ఫ్రమ్ ఫామ్ టు టేబుల్ ఎగ్జిబిట్ ను వై ఆద్య, ఖమ్మం సిటీ ఎగ్జిబిట్ ను బి. నిహాల్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ ఎగ్జిబిట్ ను కె దక్షిణ్య, జాహ్నవి, ఎర్త్వెక్ అలారం ఎగ్జిబిటును ఎస్ శన్విక, పవర్ ప్లాంట్ ఎగ్జిబిట్ ను అనుష మేఘన, అర్జున్ దేవ్, స్మార్ట్ సిటీ ఎగ్జిబిట్ ను ఎం. ప్రణవ్ తదితర ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొలుత స్మార్ట్ కిడ్జ్ ఇన్స్పైర్ ను యువ నాయకుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల యుగేందర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో సైంటిస్టులుగా ఎదిగి సమాజానికి సేవలు అందించాలని కోరారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాల లో అంత పెద్ద ఎత్తున సైన్స్ ఎగ్జిబిషన్లో చిన్నారులు పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దడం స్ఫూర్తిని ఇస్తుందని తెలిపారు. స్మార్ట్ కిడ్జ్ కరస్పాండెంట్ చింత నిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో గత 13 సంవత్సరాలుగా పాఠశాల విద్యార్థులతో సైన్స్ ఇన్స్పైర్ ను నిర్వహిస్తున్నామని విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడానికి అంకితభావంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు మోతారపు శ్రావణి సుధాకర్, పైడిపల్లి సత్యనారాయణ, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ ఇన్స్పైర్ ను విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తిలకించి చిన్నారులకు అభినందనలు తెలిపారు.

## షాహి కార్మికుల 12 రోజుల సమ్మెకు విజయం

- 8 ప్రధాన డిమాండ్లకు యాజమాన్యం అంగీకారం



**నాచారం, డిసెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం పారిశ్రామిక ప్రాంతంలోని షాహి గార్మెంట్స్ ఇండస్ట్రీలో పనిచేస్తున్న కార్మికులు జీతాల పెంపు, వేధింపుల నివారణ, బోనస్‌తో పాటు హక్కుల పరిరక్షణ కోరుతూ చేపట్టిన 12 రోజుల సమ్మె విజయవంతంగా ముగిసింది. ఈ సమ్మెకు సీఐటీయూ జిల్లా నాయకత్వం సంపూర్ణ మద్దతు తెలిపి, కార్మికుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించింది.సమ్మె నేపథ్యంలో వివిధ కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు షాహి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. సీఐటీయూ నాయకత్వం జోక్యంతో యాజమాన్యాన్ని జాయింట్ లేబర్ కమిషనర్ (జెఎల్‌సీ) వద్ద చర్చలకు రావడానికి ఒప్పించారు. మొదటి రోజు చర్చలు విఫలమైన అనంతరం, ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో మెమోరాండం సమర్పించారు. తదుపరి స్థానిక జెఎల్‌సీతో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపి డిసెంబర్ 19న జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేశారు.ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు సాగిన దీర్ఘ చర్చల్లో కార్మికులు చేసిన 12 డిమాండ్లలో 8 డిమాండ్లకు యాజమాన్యం అంగీకరించింది.యాజమాన్యం అంగీకరించిన ప్రధాన డిమాండ్లలో ప్రతి కార్మికుడికి వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వడం, స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి వేతనాల పెంపు, ఒక్కొక్కరికి రూ.900 రిటైర్మెంట్ బోనస్ చెల్లింపు, 20 శాతం బోనస్, ఉద్యోగ భద్రత కల్పించడం, వర్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు, కార్మికులపై వేధింపులు జరగకుండా చర్యలు, రోజుకు రూ.800 వరకు జరుగుతున్న కట్‌ను నిలిపివేయడం, 'నో వర్క్ - నో పే' అంశంపై పునర్విచారణ ఉన్నాయి.

ఈ అన్ని అంశాలను జాయింట్ లేబర్ కమిషనర్ నేతృత్వంలో యాజమాన్యం, కార్మికుల సమక్షంలో రాతపూర్వక ఒప్పందంగా కుదుర్చుకున్నారు. మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకు హై లెవల్ కమిటీ 15 రోజుల్లో కంపెనీని సందర్శిస్తుందని యాజమాన్యం హామీ ఇచ్చింది. పెరిగిన వేతనాలు, ఇతర ప్రయోజనాలు ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్నట్లు ఒప్పందంలో పేర్కొన్నారు.ఈ ఒప్పందాన్ని మెజారిటీ కార్మికులు ఆమోదించడంతో పాటు, మిగిలిన కార్మికులకు వివరించడంతో అందరూ తిరిగి విధుల్లో చేరారు. కార్మికులు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ చర్చల సారాంశాన్ని కార్మికులకు వివరించేందుకు పి. గణేష్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో సీఐటీయూ నాయకులు కోమటి రవి, ఎస్. రమా, రమేష్, శ్రీకాంత్, అశోక్, జి. శ్రీనివాసులు, వెంకన్న, టీయూసీఐ నాయకులు ప్రదీప్ రమేష్, సీపీఐ సత్యప్రసాద్, పీవోడబ్ల్యూ ఝాన్సీ, షాహి కార్మిక నాయకులు శాలిని, శ్యామల, వనిత, పూజ, దేవి, రింకు సింగ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.ఈ పోరాటానికి మద్దతు తెలిపిన అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్థానికులు, విలేకరులు, మీడియా మిత్రులు, పోలీసులు, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీలకు సీఐటీయూ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## గోలి రాంబాయి ని పరామర్శించిన బిజెపి జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి



**ఖమ్మం బ్యూరో ,డిసెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు):** కూసుమంచి గ్రామానికి చెందిన గోలి రాంబాయి శుక్రవారం రాత్రి వానరాల భయంతో పరిగెత్తి గాయపడినారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినారు. చికిత్స అనంతరం శనివారం వారి కుమారుడైన గోలి గోపి ఖమ్మం లోని ఇంటికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న బిజెపి పార్టీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి శనివారం ఖమ్మంలోని గోలి గోపి గృహానికి వెళ్లి రాంబాయి ని పరామర్శించారు. వారి ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# కుల వ్యవస్థ మీద 'దండోరా'..
# ఆకట్టుకుంటున్న ట్రైలర్..

లవ్, ఎమోషన్, డ్రామా వంటి కమర్షియల్ ఎలిమెంట్స్‌తోపాటు చక్కటి సోషల్ మెసేజ్‌తో రూపొందిన చిత్రం 'దండోరా'. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా రిలీజ్ కాబోతుండగా.. ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'ఊరి బయట కొంత మంది శవాన్ని మోసుకెళ్తుంటారు. ఇంత దూరం శవాన్ని ఎందుకు మోసుకు రావాలని వారితో పాటు వచ్చే చిన్న పిల్లాడు అడుగుతాడు. దానికి వాళ్లు..'మన చావు పుట్టకులన్నీ ఆ ఊరి బయట రాసిండ్రా ఆ దేవుడు..' 'విష్ణుగాడొచ్చి కాళ్లు పట్టుకున్నా పని కాదని సర్పంచ్ సాబ్ చెబుతున్నాడా అని నందుతో మురళీధర్ పాత్ర చెప్పగానే.. నువ్వు ఉన్నోడివి ఉండకుండా ఆ సర్పంచ్‌గానికి ఎందుకు చెప్పినావ్..వాడేమన్నా పెద్ద లాడ్డా' అని నందు చెప్పటం.. 'ఒటేసినావ్‌రా అని' నవదీప్ తన పక్క నుంచే వాడిని అడిగితే 'ఎంత పెద్ద మాటన్నావ్ సర్పంచ్ నీ గుర్తుకే గుద్దినా' అని వాడంటాడు. దానికి 'ఓటుకి గుద్దినావో.. క్వార్టర్ గుద్ది ఇంట్లో పండినావో ఎవడు చూసిండవయ్యా' అని నవదీప్ రియాక్ట్ కావటం.. 'ఒక ముద్దు పెట్టుకుంటానే అని రవికృష్ణ పాత్ర మణిక పాత్రను రిక్వెస్ట్ చేస్తే ఆమె ఏమో చెంప పగుల్తాది' అని సీరియస్‌గా వార్నింగ్ ఇస్తది. మరో సీన్లో అయితే శివాజీ సీరియస్‌గా ఒకర్ని కాలితో తన్ని..'భయపడ్డావా.. పడాలి' అంటూ వార్నింగ్ ఇవ్వటం.. ఊర్లో అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన నవదీప్ ప్రెసిడెంట్‌గా ఎన్నికవడం.. అక్కడి నుంచి ఊర్లో వచ్చే సమస్యలతో కుల పెద్దలకు, అతనికి మధ్య తలెత్తే ఘర్షణలు అద్భుతంగా చూపించారు. ఇలాంటి కుల వ్యవస్థ మీద ఆ గ్రామంలో ఎవరు దండోరా వేశారు.. చివరకు ఏం జరిగింది? అనేదే ఈ సినిమా.



# అందుకే చాలా అవకాశాలు కోల్పోయాను

'ఝుమ్మంది నాదం' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ తాప్సీ మనందరికీ సుపరిచితమే. ఫస్ట్ మూవీతోనే మంచి విజయం సాధించింది. ఆ తర్వాత చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. అలా అప్పట్లో ఓ రేంజ్‌కి ఎదిగిన ఈ చిన్నది ప్రజెంట్ టాలీవుడ్‌లో అంతగా సినిమాలు చేయడం లేదు. మరి దీనికి కావడం అవకాశాలు రాకపోవడమో, మరేదేమైనా కారణమా అనేది తెలియదు. ఇక ఈ చిన్నదాని పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పడే మథియాస్ బో అనే బ్యాడ్మింటన్ ప్లేయర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటినుంచి ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్‌కి షిఫ్ట్ అయ్యి.. అక్కడ వరుస సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా రాణిస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ తన హెయిర్ వల్ల చాలా అవకాశాలు కోల్పోయానని ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ.. 'కెరీర్ తొలినాళ్లలో ప్రతి దర్శకుడు నా జుట్టు స్ట్రెయిట్ చేయించుకోమని అడిగేవారు. చాలాకాలం వరకు దర్శకులు గ్లామర్, స్టెలీష్ లుక్ అంటే కేవలం స్ట్రెయిట్ హెయిర్ మాత్రమే అనే ఆలోచనలో ఉన్నారు. రింగుల జుట్టు అంటే కేవలం రెబల్ రూల్స్ అని భావించారు. అందుకే రింగుల జుట్టు ఉన్న అమ్మాయి పాజిటివ్ పాత్రలకు పనికిరాదని భావించేవారు. కెరీర్ మొదట్లో నా హెయిర్ స్ట్రెయిట్ చేయించుకోవడానికి అంగీకరించాను. కానీ తర్వాత సినిమాలే కాకుండా బ్రాండ్ యాడ్స్ సంస్థలు సైతం నా జుట్టు స్ట్రెయిట్ చేయించుకోవాలని చెప్పడం నచ్చలేదు. నాకు యాడ్ చేయడానికి చాలా పెద్ద బ్రాండ్స్ ఆసక్తి చూపించాయి.. కానీ రింగుల జుట్టు కాకుండా స్ట్రెయిట్ హెయిర్ కావాలంటే నేను రిజెక్ట్ చేశాను.



# ఆ సమయంలో చాలా భయపడ్డాను

మలయాళ బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్ ఇటీవల 'లోకా:చాప్టర్1' మూవీతో బాక్సాఫీసును షేక్ చేసింది. ఈ సినిమా అన్ని భాషల్లో విపరీతమైన ఆదరణ సొంతం చేసుకుని కలెక్షన్లతో సరికొత్త రికార్డులు క్రియేట్ చేసింది. బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ. 300 కోట్లకు పైగా వసూలు చేసింది. దీంతో కళ్యాణి ప్రియదర్శన్ క్రేజ్ విపరీతంగా పెరిగిపోయింది. ప్రస్తుతం కళ్యాణి పలు చిత్రాల్లో నటిస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. ఈక్రమంలో.. తాజాగా, కళ్యాణి ప్రియదర్శన్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొని షాకింగ్ కామెంట్స్ చేసింది. ఉ_లోకా: చాప్టర్1లో నన్ను సూపర్ హీరోగా ప్రేక్షకులు అంగీకరిస్తారో లేదో అని చాలా భయపడ్డాను. అందుకే సినిమా విడుదలై రివ్యూలు వచ్చేదాక గదిలోంచి బయటకు రాలేదు. నేనొక్కదాన్నే కాకుండా మా టీమ్ మొత్తం చాలా టెన్షన్ పడ్డాం. మేము ఎంత భయపడ్డామో అంత పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ప్రేక్షకుల నుంచి ఇంత ఆదరణ లభిస్తుందని అస్సలు ఊహించలేదు. రివ్యూలు చూశాక మా ఆందోళన మొత్తం మాయమైంది. రెస్పాన్స్ ఎలా ఉన్నా విమర్శలు రాకుండా ఉంటే చాలని భావించాం. మధ్యాహ్నం 3గంటల తర్వాత అందరం గదిలోంచి బయటకు వచ్చి సంబరాలు చేసుకున్నాం. అన్నింటికంటే ముఖ్యంగా, మేమందరం డొమినిక్‌పై నమ్మి ఈ ప్రాజెక్ట్ చేశాం. ఆ నమ్మకం లేకుండా ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. ఇంటర్వెల్ సన్నివేశం తప్ప, మేము చిత్రీకరించిన ప్రతిదీ స్క్రిప్ట్ ప్రకారమే ఉంది. ఇంటర్వె సీన్‌ను డొమినిక్ అప్పటికప్పుడు వచ్చిన ఐడియా. కానీ సినిమా విడుదల తర్వాత ఇప్పటికీ అందరూ దాని గురించే మాట్లాడుకుంటున్నారు" అని చెప్పింది.



# తండ్రి, కొడుకుల మధ్య బంధమే.. సన్ ఆఫ్..

సాయి సింహాద్రి సైన్మా పతాకంపై నిర్మాత సాయి సింహాద్రి హీరోగా నటిస్తూ... నిర్మించిన చిత్రం సన్ ఆఫ్. బత్తుల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సీనియర్ నటుడు వినోద్ కుమార్ కీలక పాత్రలో నటించారు.కాగా ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన హీరో.. ఈ కథ రియల్ లైఫ్‌లో నాకూ, మా నాన్నకు కనెక్ట్ అవుతుంది.చాలా కథలు విన్నాను. చివరకు ఈ కథకి కనెక్ట్ అయ్యాను. ఇందులో డ్రామా, ఎమోషన్ కూడా ఉంటుంది. ప్రతి కొడుకు... తన తండ్రికి చూపించాల్సిన సినిమా ఇది. ఎంతో నిజాయితీగా సినిమాని తీశాం. సీనియర్ నటుడు వినోద్ కుమార్ ఈ చిత్రానికి ఎంతో వెన్నుదన్నుగా నిలిచి కంప్లీట్ చేశారు. నేను చిరంజీవి గారికి డైహార్ట్ ఫ్యాన్‌ని. ఈ సినిమాను ఆయనకి చూపించాలని వుంది'' అని తెలిపారు. నటుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ... సన్ ఆఫ్ మూవీ ఒక రెగ్యులర్ ఫార్మాట్ సినిమా కాదు.. ఇది స్క్రీన్ ప్లే బేస్డ్ మూవీ.

# సెకండ్ ఇన్నింగ్స్‌లో అదరగొట్టిన ఉదయ్ భాస్కర్



పదహారు ఏళ్ల నటనా అనుభవంతో మరోసారి ప్రభావం చూపించేందుకు సిద్ధమయ్యాడు నటుడు ఉదయ్ భాస్కర్. ప్రస్తుతం ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా.. భావోద్వేగాలకు ప్రధాన ప్రాధాన్యం ఉన్న ఈ సినిమాలో.. ఆయన నటనే ప్రధాన బలంగా నిలుస్తుందని యూనిట్ సభ్యులు చెబుతున్నారు.సహ నటి నక్షత్రతో ఆయన నటించిన సన్నివేశాలు సహజంగా, నిజాయితీగా వచ్చాయని.. ఇద్దరి మధ్య కనిపించే భావోద్వేగ అనుసంధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఎడిటింగ్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సౌండ్ డిజైన్ వంటి సాంకేతిక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. ఉదయ్ భాస్కర్ నటనను మరింత ప్రభావవంతంగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోందని వెల్లడించింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in